క్లుప్తంగా

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

తంబళ్లపల్లె: మండలంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులపై సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఈ శ్రీనివాసబాబు, ఈఈ బాలాజీ హెచ్చరించారు. పలు వ్యాపార దుకాణాలు, ఇళ్లకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 44 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కేసులకు సంబంధించి రూ.2.47 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ శ్రీనివాసరావు



రామసముద్రం: రామసముద్రం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలకు ముందు తహసీల్దార్‌గా వచ్చిన శ్రీనివాసులు నాలుగు రోజుల క్రితం తిరిగి బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు. అతని స్థానంలో డీటీకు బాధ్యతలు అప్పగిస్తూ మదనపల్లి సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు



ప్రత్యేక అలంకారంలో సుబ్రమణ్యస్వామి

రామసముద్రం: రామసముద్రం దిగువపేటలో వెలసిన ప్రసన్న పార్వతీసమేత చంద్రశేఖర్‌స్వామి ఆలయంలోని సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యంస్వామికి అభిషేకాలు, పుష్పలంకరణ , కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు బాలస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సుబ్రమణ్యస్వామికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు కలికిరిలో ఆడికృత్తిక మహోత్సవం

కలికిరి: పట్టణంలో వెలసిన పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శివకుమార్ శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు అభిషేకం, సాయంత్రం 7 గంటలకు కళ్యాణోత్సవం జరుగుతుందని, భక్తాలు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వృద్ధులకు చీరలు పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం ఎన్ఆర్ఐ భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు చీరలు పంపిణీ చేశారు. వృద్ధులను పలకరించి వారికి స్వీట్లు పంచిపెట్టారు. వెలుగు పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

పింఛన్‌దారులూ తస్మాత్ జాగ్రత్త

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వం ద్వారా వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, కిడ్నీ వ్యాధిగ్రస్థులు ప్రతి నెలా పింఛన్ పొందుతున్నారా.. అయితే ఆగస్టు నుంచి జాగ్రత్త వహించండి. ప్రతి నెలా 1, 2 తేదీల్లో మాత్రమే పింఛన్ పంపిణీ చేయనున్నారు. ఎవరైనా పొట్టకోటి కోసం బయట రాష్ట్రాలకు వలసలు వెళ్ళినా, అత్యవసరంగా ఆసుపత్రులకు వెళ్లినా ఈ రెండు రోజుల్లోనే వచ్చి పింఛన్ సొమ్ము తీసుకోవాలి. 3వ తేదీ నుంచి ఎట్టి పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ తెరుచుకోదు. పింఛన్ సొమ్ము చేతికి అందాలంటే ఈ రెండు రోజుల్లో తీసుకోవాలి. ఈ విషయంపై తమకు ప్రభుత్వం ద్వారా సమగ్రమైన ఆదేశాలు అందినట్లు ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి సోమవారం పేర్కొన్నారు.

ముగిసిన పీర్ల ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మర కుంటలో వారం రోజుల పాటు నిర్వహించిన పీర్ల పండుగ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. పంచాయతీలోని అన్ని గ్రామాల్లో పీర్లను ఊరేగించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలంతా సహకరించి ఉత్సవాలను విజయవంతం చేసినందుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

శిక్షా-సప్తాహ్‌తో పాఠశాలల అభివృద్ధి



కలకడ: కోన ఉన్నత పాఠశాలలో సహపంక్తి భోజనం



కురబలకోట: తెట్టు జెడ్పీ హైస్కూల్‌లో తిథి భోజనం

కలకడ : శిక్ష-సప్తాహ కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలు భాగస్వాములు చేయడం అవసరమని, అందులో దాతల సహకారం మరువలేనిదని మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కోన ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్ష-సప్తాహ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోసి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు క్రీడా పరికరాలు, వస్తువులు వితరణ చేయడం, ఆర్థికంగా సహకారం మరువలేనిదని కొనియాడారు. సోమవారం కోన ఉన్నత పాఠశాలకు రూ.20 వేలు విలుచేసే క్యారం బోర్డు, చెస్, వాలీబాల్ వంటి క్రీడాసామగ్రిని దాతులు వితరణ చేశారు.

సహపంక్తి భోజనాలతో సమానత్వం

గుర్రంకొండ : సహపంక్తి భోజనాలతో విద్యార్థుల్లో సమానత్వం ఏర్పడుతుందని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. సోమవారం శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో సహపంక్తి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలు గుర్రం శ్రీనివాసులురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ రవి, మంగీలాల్, సివి రమణ, వినాయక స్వీట్స్ వారి సహకారంతో విద్యార్థులకు విందుభోజనం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దాతల సహకారంతో 550 మంది విద్యార్థులకు స్వీట్లు, పండ్లతో కూడిన విందుభోజనం వడ్డించారన్నారు. ఇలాంటి సహపంక్తి భోజనాలతో విద్యార్థుల్లో అసమానతలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ రమేష్, ఉపాధ్యాయులు రెడ్డిమోహన్, జావీద్ పాల్గొన్నారు.

కురబలకోటలో..

కురబలకోట: మండలంలో 45 పాఠశాలల్లో సోమవారం తిథి భోజనాలు నిర్వహించారు. శిక్షా సప్తాహ్ చివరి రోజు కార్యక్రమంలో భాగంగా తెట్టు జడ్పీ హైస్కూల్‌లో సోషల్ టీచర్ చిటికి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 160 మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సేవా దృక్పథం అభివృద్ధి చెందుతుందని ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు అన్నారు.

పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం

వాల్మీకిపురం: పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించినట్లు స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజనంతోపాటు కేసరిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఇండ్లలో జరిగే శుభ కార్యక్రమాలు, పుట్టిన రోజులు తదితర కార్యక్రమాలల్లో పాఠశాలల్లోని విద్యార్థులకు స్వీట్లు, పండ్లు వంటివి అందించవచ్చునన్నారు. కార్యక్రమలో ఫర్హాత్, పుష్పలత, నాగసునిత, రాధ, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

మదనపల్లె సిటీ: మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుభ తిథి భోజనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మధ్యాహ్న భోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలలో అందరూ భోజనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్ష సప్తాహ్ వారోత్సవాలు

కేవీపల్లె : మండలంలో శిక్ష సప్తాహ్ వారోత్సవాలు ముగిసినట్లు ఎంఈఓ రెడ్డిబాషా తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సహపంక్తి భోజనాలు (శుభ్ దిన్ భోజన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం దేశంలో విద్యాభివృద్ధి చేయడమే లక్ష్యంగా శిక్ష సప్తాహ్ వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. చివరి రోజు మండలంలోని అన్ని పాఠశాలలో దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం తోపాటు స్వీట్లు, ఫలహారాలు అందించినట్లు చెప్పారు. కార్యకరమంలో ప్రధానోపాధ్యాయులు వై.వి. రమణ, దాతలు ఆర్. కృష్ణారెడ్డి, రెడ్డెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







గుర్రంకొండ : సహపంక్తి భోజనాల కార్యక్రమం, మదనపల్లె: విద్యార్థికి అన్నం తినిపిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కలకడ: క్రీడాసామగ్రిని వితరణ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

– సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం సబ్ కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆయన ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి అర్జీలను తీసుకుని, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. సబ్ కలెక్టరేట్‌లో గత ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనతో వారంరోజులుగా కార్యాలయ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. తిరిగి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంతో కార్యాలయ విధులు ప్రారంభం కావడంతో...అర్జీలు సమర్పించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు సబ్ కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు నిషేధిత భూముల తొలగింపు, చుక్కలభూములు, పాసుపుస్తకాలు, ఆస్తుల భాగపరిష్కారాలు, సర్వే సమస్యలు, భూఆక్రమణలు తదితర సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. వాటి పరిష్కారం దిశగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారం కాకపోతే, కారణం తెలుపుతూ అర్జీదారుడికి ఎండార్స్‌మెంట్ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

నిమ్మనపల్లె : రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. సోమవారం నిమ్మనపల్లె మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డుల గది, వీఆర్వోలు, సిబ్బంది గదులను పరిశీలించారు. డీకేటీ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యాలయం చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపై డిప్యూటీ తహసీల్దార్ తపస్వినిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు భద్రపరచడంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో తహసీల్దార్ కార్యాలయ భద్రతాచర్యలు పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లీ.. దీవించమ్మా



పుష్పపల్లకీ వాహనంపై వారాహి అవతారంలో విహరిస్తున్న ఎల్లమ్మ

- సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన కలికిరి
- అలరించిన లంకాదహనం
- పుష్పపల్లకీపై విహరించిన అమ్మవారు



విశేషాలంకరణలో ఎల్లమ్మ

కలికిరి: కోరిన కోర్కెలు తీర్చే ఎల్లమ్మ తల్లీ.. దీవించమ్మా అంటూ భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. కలికిరి ఎల్లమ్మ జాతరను పురస్కరించుని మూడవ రోజు సోమవారం ఎల్లమ్మ కన్యకాపరమేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు చాందినీ బండ్లుతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. వినూత్న హంగులు, రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలతో చాందినీ బండ్ల అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం నుంచి అమ్మవారి సర్వదర్శనం ప్రారంభమైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ కేడ్లు, ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లంకాదహనం కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

పుష్ప పల్లకీపై ఎల్లమ్మ

సోమవారం రాత్రి ఎల్లమ్మ పుష్పపల్లకీ వాహనంపై వారాహి అవతారంలో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఆర్‌ఎస్ రోడ్డు, బ్రాహ్మణ వీధి, మెయిన్ బాజారు, రైల్వే బ్రిడ్జి వరకు, తిరిగి ఆలయం వద్దకు సాగింది. ఇంటింటి వద్ద భక్తులకు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి, కొబ్బరికాయలు సమర్పించి అమ్మవారి కటాక్షం పొందారు. కాగా పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి దంపతులు పుష్పపల్లకీ ఉభయదారులుగా వ్యవహరించి, పల్లకీ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు ఆర్.మధుసూదన్ రెడ్డి, ఆర్.సురేంద్రరెడ్డి, ఆర్.యోగేష్ రెడ్డి, రెడ్డివారి యువత, అమ్మవారి సేవా వలంటీర్లు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి



మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజర్ అమరావతి

తంబళ్లపల్లె: మండలంలోని మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి, బ్యాంకు రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించాలని స్త్రీనిధి మేనేజర్ అమరావతి కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు ఆటో డెడిట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం స్త్రీ నిధి నుంచి రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తంబళ్లపల్లె మండలంలో రూ.1.20 కోట్లు, ములకలచెరువులో రూ.3.80 కోట్లు, పెద్దమండ్యంలో రూ.1.42 కోట్లు ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. రుణాలు తీసుకున్న మహిళా సభ్యుల నుంచి తంబళ్లపల్లె మండలంలో రూ.10.16 లక్షలు, పెద్దతిప్పసముద్రంలో రూ.11.25 లక్షలు, పెద్దమండ్యంలో రూ. 1. 61 లక్షలు, బి.కొత్తకోటలో రూ.1.57 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మహిళ సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించినప్పుడే ఇతర సంఘాల సభ్యులకు మరిన్ని రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో సీసీలు, సంఘమిత్రలు,సభ్యులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు రూ.9.25 లక్షల రాయితీ సొమ్ము విడుదల

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్ పరిధిలోని పట్టు పురుగుల పెంపకపు రాష్ట్ర రాయితీ రైతులకు విడుదల చేసినట్లు పట్టుపరిశ్రమ శాఖ ఏడీ రామమోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2020-21-22,23 సంవత్సరాలకు సంబంధించి 10 మంది రైతులకు రూ.9,25,000 విడదల చేసినట్లు తెలిపారు. ఈ సొమ్ము సంబంధిత రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

పట్టు పెంపకంతో అధిక లాభాలు:

రైతులు పట్టు పెంపకం చేపట్టాలని ఏడీ రామమోహన్ తెలిపారు. పట్టు పెంపకం చేపట్టడం వల్ల అధిక లాభాలు వస్తాయన్నారు. రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు

మదనపల్లె : జిల్లా ఆస్పత్రి భద్రతా సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు అన్నారు. ఇటీవల జిల్లా ఆస్పత్రిలో వైద్యుని ద్విచక్రవాహనం చోరీకి గురికావడంపై మెడికల్ సూపరింటెండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం భద్రతాసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే ఉపేక్షించేది లేదన్నారు. సెక్యూరిటీ సిబ్బంది తమ విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. 16 సీసీ కెమెరాలకు కేవలం 8 మాత్రమే పనిచేయడాన్ని గుర్తించారు. వెంటనే మిగిలిన కెమెరాలను మరమ్మతులు చేయించడంతో పాటు అవసరమైన చోట మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అవుట్‌పోస్ట్‌లో మరో సిబ్బంది అవసరమని గుర్తించి డీఎస్పీకి వినతిపత్రం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ ప్రసాదరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుత్తణికి తరలివెళ్లిన భక్తులు



కావళ్లతో వెళుతున్న భక్తులు

మదనపల్లె సిటీ: ఆడికృత్తిక పురస్కరించుకుని భక్తులు కావళ్లతో సోమవారం బయలుదేరి వెళ్లారు. స్థానిక మేదరవీధి, రంగారెడ్డి కాలనీ, కొత్త ఇండ్లుకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని వల్లీదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో పూజలు చేసి బయలుదేరారు. ఆలయంలో ఉదయం అర్చనలు, విశేష పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఆడికృత్తిక సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

రోడ్లు ధ్వంసం చేసిన వారిపై చర్యలకు డిమాండ్



ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

పీలేరు : పీలేరు పట్టణంలో ఇష్టారాజ్యంగా రోడ్లు ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డు, కోటపల్లె రోడ్డు తదితర ప్రాంతాల్లో జియో, ఇతర నెట్ వర్క్ కేబుల్ విస్తరణలో భాగంగా జేసీబీలు, హిటాచీలతో తారు రోడ్లు, సీసీ రోడ్లు కాలువలుగా, గుంతలుగా తోడివేసి వదిలేశారని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టణంలో ఎవరైనా తాగునీటి కొళాయి కనెక్షన్ కోసం ఎక్కడైనా రోడ్లు గుంతలు పెడితే పంచాయతీ అనుమతి తప్పనిసరి అని, కనెక్షన్ తీసుకున్న వారే వాటిని తిరిగి మరమ్మతు చేయాల్సి ఉండేదన్నారు. అయితే పెద్ద పెద్ద కంపెనీలు ఇష్టానుసారం రోడ్లలో గుంతలు, కాలువలు తీస్తే మరమ్మతులు బాధ్యత ఎవరు చేపడుతారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపించాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ఆర్టీసీ బస్టాండు రోడ్డులో గ్రామ పంచాయతీ వారు కాలువ తీసి వదిలేయడంతో స్థానిక ప్రజలు, ప్రయాణీకులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అమరాల వెంకటరమణ, భాస్కర్, చరణ్‌కుమార్, రాజేష్, అన్నవరం పాల్గొన్నారు.

కాలేయ వ్యాధి నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు కాలేయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ హెపటైటిస్ చాలా ప్రమాదకరమైన కాలేయ సంబంధిత వైరల్ అంటు వ్యాధి అన్నారు. ఈ వ్యాధి ఒక వైరస్ ద్వారా వస్తుందన్నారు. వ్యాధి నియంత్రణలో భాగంగా శిశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో హెపటైటిస్ బి వ్యాక్సిన్ కూడా వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, సిహెచ్‌వో ఇందిరారాణి, వైద్య సిబ్బంది భానుబి, హృదఈశ్వరి, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ జంగంరెడ్డిగారిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నారాయణ సోమవారం తనిఖీ చేశారు. సులభ పద్ధతుల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం శుభదిన్ భోజన్ ఏర్పాటును పర్యవేక్షించి పిల్లలకు భోజనం, అరటి పండ్లు, కేసరిలను వడ్డించారు.

విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టారు

సాక్షి ఎఫెక్ట్..



పెద్దతిప్పసముద్రం: స్థానిక తిప్పరాయ చెరువులో కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం అని సోమవారం సాక్షి పత్రికలో వెలువడిన వార్తకు డిస్కం అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో ఏఈ ఉత్తన్న, సర్పంచ్ తమక శంకర్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేలా చర్యలు చేపట్టారు. దీంతో దినసరి కూలీలు, పశు కాపరులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల భూములు కబ్జాచేస్తే ఉపేక్షించేది లేదు

- భూ సమస్యలపై పంచాయతీల్లో గ్రీవెన్స్‌సెల్
- మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గంలో ప్రభుత్వ, పేదలకు చెందిన భూములను కబ్జాచేస్తే ఉపేక్షించేది లేదని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మదనపల్లె సబ్ కలెక్టట్‌లో గత ఆదివారం జరిగిన అగ్నిప్రమాదఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. ప్రమాద ఘటన వార్త తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు... డీజీపీ, సీఐడీ చీఫ్‌లను మదనపల్లెకు పంపి విచారణకు ఆదేశించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో కీలకభూమిక పోషించాల్సిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రాజకీయనాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పులు చేయడం, వాటిని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటివి చేయడం బాధాకరమన్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లోని బీకే.పల్లె, బైపాస్‌రోడ్డు, కాట్లాటపల్లె, వలసపల్లె, సీటీఎం తదితర పంచాయతీల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమలు అన్యాక్రాంతమవడంతో పాటుగా ఆక్రమణకు గురయ్యాయన్నారు. నియోజకవర్గంలోని భూసమస్యల పరిష్కారం కోసం ప్రతి పంచాయతీలోనూ గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్, రామకృష్ణ, ఇంతియాజ్, నాదెళ్లవిద్యాసాగర్, రామరావాంజనేయులు, వేణు, దాదాపీర్, జీ.వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్‌బీ సుబ్బారావు

తంబళ్లపల్లె: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ పారదృకంగా నిర్వహించాలని ఎస్ఆర్‌బి సుబ్బారావు తెలిపారు. సోమవారం స్త్రీ శక్తి భవనంలో సామాజిక తనిఖీ నిర్వహణపై మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏలకు శిక్షణ ఇచ్చారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెల వరకు జరిగిన పనులన్ని తనిఖీ చేయాలన్నారు. ఈ తనిఖీలు 7 మంది డీఆర్‌పీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌పీఎం లోకేశ్వరరెడ్డి, ఎంపీడీఓ క్రిష్ణమూర్తి, ఏపీడీ మధుబాబు, ఏపీఓ అంజనప్ప, ఏఈలు అశోక్, హరినాథ్, మండల టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు



జేసీబీతో చెత్తాచెదారం తొలగిస్తున్న దృశ్యం

కేవీపల్లె : మండలంలోని తువ్వపల్లె పంచాయతీలో సోమవారం పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. పంచాయతీ పరిధిలో ఇళ్లకు దగ్గర ఉన్న పేడదిబ్బలను, చెత్తాచెదారంను తొలగించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా జీవించగలరన్నారు. పంచాయతీలో స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

తంబళ్లపల్లె: స్థానిక ప్రభుత్వ కాలేజీ, మోడల్ స్కూల్, కేజీబీవీలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య, నోటు పుస్తకాలు సోమవారం పంపిణీ చేసినట్లు ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. 320 మంది విద్యార్థులకు ఎమ్మార్సీ కార్యాలయం నుంచి పుస్తకాలు పంపిణీ చేశారు.